ప్రజాశక్తి
మంగళవారం 11 ఏప్రిల్ 2023
5
శ్రీ సత్యసాయి

నూతన కలెక్టర్‌ను కలిసిన పుడా ఛైర్‌పర్సన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అరుణ్‌కుమార్‌ను పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ గంగాద్రి సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అంతేగాకుండా పుట్టపర్తి నియోజకవర్గం మొత్తం పుడా పరిధిలోకి వచ్చినందున నియోజకవర్గ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా పలు సమస్యలు, జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అంతుకుముందు కలెక్టరేట్‌లోని సిబ్బంది నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు, బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు.

ఆత్మకూరులోని బొప్పాయి తోట

'బొప్పాయి'కి వైరస్

◆ భారీగా తగ్గిన దిగుబడి ◆ ధరలూ అంతంత మాత్రమే
◆ పెట్టుబడి కూడా రావడం లేదంటున్న రైతులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

బొప్పాయి పంటకు తెగుళ్లు సోకాయి. దీంతో దిగుబడి భారీగా తగ్గింది. కాయ పెరిగే సమయంలో తెగుళ్లు పట్టుకోవడంతో పంట మొత్తం చేతికందకుండా పోతోంది. దీనికి తోడు ధర కూడా పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. మండలంలోని వై.కొత్తపల్లి, సింగంపల్లి, పంపనూరు, గోరిదిండ్ల, మదిగుబ్బ తదితర గ్రామాల్లో 300 ఎకరాల్లో బొప్పాయి సాగు చేశారు. ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.80 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. ఈ పంటకు వైరస్ మూలంగా ఆకులు ముడుచుకపోయి, పండుబారాయి. దీంతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 30 టన్నులు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 10 టన్నులు మాత్రమే వస్తోంది. పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. గత నెలలో టన్ను రూ.18 వేలు ధర పలికింది. ప్రస్తుతం రూ.8 వేలకు పడిపోయింది. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రంజాన్ మాసంలో ప్రతి ఏడాది బొప్పాయి పంటకు అధిక ధరలు ఉండేవి. ఈ ఏడాది ధరలు పతనం అవడంతో రైతులకు నష్టాలు మిగిలాయి. ఇక ధరలు కూడా వ్యాపారులు నిర్ణయించిన మేరకే విక్రయించాల్సి వస్తోంది. ఒక్క ఆత్మకూరు మండలంలోనే పెట్టుబడి రూపంలో బొప్పాయి రైతులు రూ.2 కోట్ల వరకు నష్టపోతున్నట్లు తెలుస్తోంది. రైతులు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం ద్వారా ఉద్యాన పంటలకు రాయితీలు అందడం లేదు. బొప్పాయికి సోకిన వైరస్ నిర్మూలనకు సూచనలు, సలహాలు ఇచ్చిన దాఖలాలూ కన్పించడం లేదు. ఇప్పటికైనా ఉద్యానశాఖ అధికారులు స్పందించి తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం స్పందించి పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇసుక రీచ్‌ను రద్దు చేయాల్సిందే

◆ లేకుంటే పోరాటం ఉధృతం
◆ రీచ్ వద్ద సిపిఎం, జనసేన ఆందోళన
◆ నాయకుల అరెస్టు, విడుదల

ఇసుక రీచ్ వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం, జనసన నాయకులు

సిపిఎం మండల కార్యదర్శి నాగరాజును బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పరిగి

పరిగి మండలం జయమంగళి నదీ పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని గత వారం రోజులుగా కొనసాగుతున్న ఆందోళన కార్యక్రమాలు ఉధృత రూపం దాలుస్తున్నాయి. సోమవారం నాడు సిపిఎం, జనసేన ఆధ్వర్యంలో రీచ్ వద్ద నిరసన తెలిపారు. రీచ్ వద్ద నాయకుల ఆందోళనలు చేస్తారన్న సమాచారంతో పోలీసులు ముందస్తు అరెస్టులకు సిద్ధం అయ్యారు. పోలీసుల కళ్లు గప్పి సిపిఎం, జనసేన నాయకులు స్థానిక ప్రజలు, రైతులతో కలిసి బోరెడ్డిపల్లి గ్రామం నుంచి పంట పొలాల మీదుగా కాలినడకన ఇసుక రీచ్ వద్దకు చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆందోళకారులను బలవంతంగా అరెస్టు చేసి, మడకశిర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు, లింగారెడ్డి, రాము, సాంబ, జనసేన నాయకులు సురేష్, నాగేష్, రమేష్ తదితరులు ఉన్నారు. అరెస్టుల విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ పరిగికి చేరుకున్నారు. పోలీసుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు ఇంకిపోయి తాగునీరు దొరకడమే కష్టతరంగా మారిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కొద్దిగా భూగర్భ జలాలు పెరిగాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జయమంగళి పరివాహక ప్రాంతంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి మళ్లీ నీటి సమస్య ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రాంతం నుంచి నిత్యం వందల టన్నుల ఇసుకను టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని చెప్పారు. రీచ్ వల్ల తమకు నష్టం వాటిల్లితుందని, దీనిని రద్దు చేయాలని సమీప గ్రామాల ప్రజలందరూ ముక్తకంఠంతో ప్రభుత్వం, అధికారులకు నివేదిస్తున్నా వారు పట్టించుకోకపోవడం దుర్మార్గం ఉందన్నారు. వ్యక్తిగత స్వార్థంతో వైసిపి చేస్తున్న దుర్మార్గాన్ని ప్రజలు గమనిస్తున్నారని, రాబోవు రోజుల్లో ఆ పార్టీకి గట్టిగా బుద్ధిచెబుతారని హెచ్చరించారు. వైసిఎ రీచ్‌ను రద్దు చేయకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. అరెస్టులకు తామ భయపడేది లేదని, ప్రజల కోసం ఎంతటి ఉద్యమానికైనా సిద్ధం అని స్పష్టం చేశారు.

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా

◆ నూతన కలెక్టర్ పి.అరుణ్‌బాబు
◆ కలెక్టరేట్‌లో బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కష్టపడి పని చేస్తానని నూతన కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. సోమవారం సాయంత్రం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను రాయలసీమలో మొదటిసారి పనిచేస్తున్నానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. జిల్లా అభివద్ధి కోసం అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పనిచేస్తానన్నారు. అనంతరం శ్రీ సత్య సాయి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. నూతన కలెక్టర్‌కు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కలెకటర్‌కు స్వాగతం పలుకుతున్న జాయింట్ కలెక్టర్

అక్రమ కట్టడాన్ని తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని దర్గాపేటలో రహదారికి అడ్డంగా నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని సిపిఎం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు దర్గాపేటవాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రమేష్, దర్గాపేటవాసులు మాట్లాడుతూ దర్గాపేటలోని సర్వేనెంబర్ 221లో రహదారికి అడ్డంగా గుంతకల్లుకు చెందిన నబిరసూల్ అనే వ్యక్తి రాత్రికి రాత్రే కాంపౌండ్ నిర్మించాడన్నారు. నగర పంచాయతీ ఛైర్మన్ ఉమర్ ఫరూక్ అండతో రోడ్డుకు అడ్డంగా రాత్రికి రాత్రి పబ్లిక్ కొళాయిని పూడ్చి అక్రమంగా గోడ నిర్మించారని ఆరోపించారు. ఈ విషయమై అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో నాలుగు నెలల నుంచి పిల్లలు, వృద్ధులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనేపథ్యంలోనే ఆదివారం డ్రెయినేజీలో పడి ఓ వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యాడన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణానికి తొలించాలని సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు సబ్ కలెక్టర్ స్పందిస్తూ అక్రమ నిర్మాణానికి తొలగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, నాగప్ప, దర్గాపేటవాసులు మౌలా, ఫైజాన్, ఖాదర్‌బాషా, ఖలీల్, ముక్తం, జబ్బార్, అలీ, ఫరూక్, నూర్జాహన్, ముంతాజ్, రమా, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు : ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

ప్రజాశక్తి-తలుపుల

ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ, అభివృద్ధిని రెండు కళ్లలా భావించి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని తలుపుల-1 సచివాలయం పరిధిలో ఉన్న సంఘం బజార్, బలిజపేటలో జడ్పీఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా సిమెంట్, కాంక్రీట్ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మించడంతోపాటు ఎలక్ట్రికల్ పోల్స్ వేయించాలని స్థానికులు కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సిఎం జగన్ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారన్నారు. దీంతో ప్రతి ఇంటికీ పథకాలు చేరుతున్నాయన్నారు. వీటన్నిటినీ చూసి ఓర్వలేని చంద్రబాబు, వారి దుష్టచతుష్టయం బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వాటిని ప్రజలు తిప్పి కొట్టాని పిలుపునిచ్చారు. అనంతరం టోల్ ఫ్రీ నెంబర్ 82960 82960కు మిస్డ్ కాల్ ఇచ్చి ఐవిఆర్ఎస్ ద్వారా సిఎం జగన్ సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు, జడ్పీటీసీలు, వైస్ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

జగనన్న కాలనీ పరిశీలన

మండల కేంద్రం సమీపంలోని గంజివారిపల్లి రోడ్డు వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకు అందజేసిన ఇంటి స్థలాల్లో నిర్మాణాలు చేపట్టే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రాభివృద్ధి 30 ఏళ్లు వెనక్కు..

◆ అన్ని సామాజిక వర్గాలకూ సబ్సిడీ రుణాలు ◆ పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-శింగనమల

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రాభివృద్ధి 30 ఏళ్లు వెనక్కు వెళ్లిందని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. లోకేష్ యువగళం పాదయాత్ర అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో సోమవారం 66వ రోజు కొనసాగింది. ఉదయం 8 గంటలకు సోదనిపల్లి క్రాస్ నుంచి పాదయాత్ర ప్రారంభం అయ్యింది. పెద్దమట్లగొంది, చిన్నమట్లగొంది, సలకంచెరువు, కొరివిపల్లి, ఉల్లికల్లు గ్రామాల్లో కొనసాగింది. ఉల్లికల్లులో రాత్రికి బస చేశారు. సోదనపల్లి గ్రామ వద్ద గ్రామ శివారు వద్దకు రాగానే అక్కడ గొర్రెల పెంపకందారులు కన్పించారు. లోకేష్ వారివద్దకెళ్లి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెద్దమట్లగొందిలో యాదవ సామాజిక వర్గీయులతో చిన్నమట్లగొందిలో స్థానికులతో మాటామంతీ నిర్వహించారు. సలకంచెరువులో గాండ్ల, ఎస్సీ సామాజిక వర్గీయులతో ముఖాముఖి నిర్వహించారు. కొరివిపల్లి ఉల్లికల్లులో స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో లోకేష్ మాట్లాడారు. వైసిపి అధకారంలోకి వచ్చాక కార్పొరేషన్లు ఎందుకూ పనికి రాకుండా పోయాయన్నారు. ఏ ఒక్కరికీ సబ్సిడీ రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. వైసిపి పాలనలో రాష్ట్ర అభివద్ధి 30 సంవత్సరాలు వెనక్కు వెళ్లిందన్నారు. రాబోవు రోజుల్లో రాష్ట్రం అభివద్ధి జరగాలంటే ప్రజలు టిడిపికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. టిడిపి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, ముస్లిం, మైనార్టీ వర్గాల వారందరి అభివృద్ధికి చేయూతనిస్తామన్నారు. సలకం చెరువు గ్రామంలో బిసిలతో నిర్వహించిన కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యావ్యస్థను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ బాధ్యతను అధికారంలోకి రాగానే టిడిపి తీసుకుంటుందని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థులు చదవుతున్న పుస్తకాలు చాలా ఏళ్లకాలం నాటివి, వాటిని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యా వ్యస్థను మారుస్మాన్నారు. విద్యలో ప్రభుత్వ, ప్రయివేటు రెండు కలగలిసి వెళ్తేనే ప్రయోజనం ఉంటుందన్నారు. గొర్రెల పెంపకం దారులతో లోకేష్ మాట్లాడుతూ గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం ద్వారా సబ్సిడీ పథకాలను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి, టూమెన్ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు ఎంఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకాపరులతో మాట్లాడుతున్న నారా లోకేష్

పాదయాత్ర చేస్తున్న లోకేష్

హ్యాండ్‌లూమ్‌ను పరిరక్షించాలి

ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పవర్‌లూమ్‌లో చేనేత రకాలు తయారు చేయకుండా అరికట్టడంతోపాటు హ్యాండ్‌లూమ్‌ను పరిరక్షించాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మవరంలో అన్నివర్గాల ప్రజలు చేనేత పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అలాంటి పరిశ్రమ నేడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. అలాంటి పరిశ్రమను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఆయా సమస్యలపై పరిష్కరించేందుకు ఈనెల 13న ధర్మవరంలోని సిరిపెడ్ కార్యాలయంలో చేనేత సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఎన్‌ఫోర్స్‌మెంట్, హ్యాండ్లూమ్ అధికారులు హాజరవుతున్నారు. కావున చేనేత కార్మికులు భారీఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు జిల్లా నాయకులు ఎస్‌హెచ్.బాషా, ఎస్ఎఫ్ఎస్ఐ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

విలేఖరులతో మాట్లాడుతున్న ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు

పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి

విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ టిడిపి ఆందోళన

ప్రజాశక్తి-పెనుకొండ

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి అన్నారు. సోమవారం పట్టణంలోని బిటిఆర్ కాలనీ వద్ద ఉన్న సబ్‌స్టేషన్ ఎదుట బికె ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014కు ముందు విద్యుత్ లోటు 1.2 మిలియన్ యూనిట్లు ఉండగా టిడిపి అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విద్యుత్ లోటును పూడ్చి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఇచ్చారన్నారు. అయితే తిరిగి జగన్ అధికారంలోకి వచ్చా విద్యుత్ సమస్యల మొదటికొచ్చిందన్నారు. అంతేగాకుండా విపరీతంగా కోతలు విధిస్తున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించడంతోపాటు విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, జిల్లా అధికార ప్రతినిధి రఘువీరాచౌదరి, మండల కన్వీనర్ సిద్ధయ్యయ, టౌన్ కన్వీనర్ రవిశంకర్, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, నాయకులు హుజూర్, టౌన్ కన్వీనర్ గాయత్రి, పోతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసులు, రమేష్‌నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

బాగేపల్లి న్యూస్

రోడ్డు బాధితులకు న్యాయం చేస్తాం

బాగేపల్లి సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్

ప్రజాశక్తి-చిలమత్తూరు(బాగేపల్లి నుంచి)

తనను గెలిపిస్తే బాగేపల్లి క్షేత్రంలోని గుడిబండ తాలూకా కేంద్రంలో రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు, అంగళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గుడిబండ తాలూకా కేంద్రంలోని 2, 3, 4, 5, 6, 7, 8వ వార్డుల్లో జోరుగా ప్రచారం సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో భాగంగా స్థలాలు, ఇళ్లు, అంగళ్లు కోల్పోయిన వారిని ప్రస్తుత పాలకులు మోసం చేశారన్నారు. ముఖ్యంగా ఇళ్లు కోల్పోయిన వారికి వేరే ప్రాంతంలో ఇంటి స్థలాలు మంజూరు చేయాల్సి ఉండగా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. కాగా తమకు జెడిఎస్ పార్టీ మద్దతు పలకడం సంతోషంగా ఉందన్నారు. సెక్యులర్ పార్టీగా ఉన్న జెడిఎస్ బాగేపల్లి అభివృద్ధిని కాంక్షిస్తూ తమను బలపచడం హర్షించదగ్గ విషయమన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో పెరిగిన అవినీతిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. జెడిఎస్ పార్టీ తాలూకా ముఖండరు సమీవుల్లా మాట్లాడుతూ బాగేపల్లి సర్వతోముఖావృద్ధి చెందాలంటే డాక్టర్ అనిల్‌కుమార్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. బాగేపల్లి క్షేత్రంలో సిపిఐ(ఎం) అభ్యర్థిని తమ పార్టీ బలపరచడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా కార్యదర్శి జయరామ్‌రెడ్డి, కెపిఆర్‌ఎస్ నాయకులు తాలూకా కార్యదర్శి ఆదినారాయణస్వామి, వెంకటరమణ, గంగరాజు, రఫీవుల్లా, సోమశేఖర్‌రెడ్డి, డివైఎఫ్ఐ శ్రీనివాసులు, అప్రోజ్, ఆజం, నయాజ్, సాదిక్, సక్లేన్, ఇమ్రాన్, ముకిత్, సమీప, హరీష్, మన్సుర్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్‌కి పూలమాలలు వేసి సత్కరిస్తున్న జెడిఎస్ నాయకులు సమీవుల్లా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

వైసిపి అధికారంలోకి వచ్చాక పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆసరా వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపం సమీపంలో ఏర్పాటు కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలకు మెగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా అక్కచెల్లెమ్మలను ఆదుకున్న ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. టిడిపి హయాంలో మహిళలను ఆదుకుంటామని చెప్పి చంద్రబాబు నిట్టనిలువునా మోసం చేశారన్నారు. సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అవినీతికి చోటు లేకుండా నేరుగా ఖాతాలోకి డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఇందుకూరు నారాయణరెడ్డి, జడ్పిటిసి తిరుమల బైసేవే నాయక్, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

'స్పందన'పై సకాలంలో స్పందించాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

స్పందన కార్యక్రమంలో అర్జీలపై ఆలస్యం చేయకుండా సకాలంలో స్పందించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు వరకట్న వేధింపులు, ఉద్యోగ మోసాలు, అత్తారింటి వేధింపులు, సైబర్‌నేరాలు, భూవివాదాలు తదితర సమస్యలపై అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టపరంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ కెవి.రామకృష్ణప్రసాద్, ఎస్‌బి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తనకల్లు : మండల పరిధిలోని బీటీ క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతిచెందాడు. మరో పదిమందికి గాయాలయ్యాయి. ఎస్ఐ రాంభూపాల్‌యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకా చిన్నసంద్ర గ్రామానికి చెందిన ఓ కుటుంబం కుటుంబ సమేతంగా బాలిక తలనీలాలు సమర్పించేందుకు కదిరి ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి వచ్చారు. స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళుతుండగా మండల పరిధిలోని బిటి క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మి (45) అక్కడికక్కడే మృతిచెందింది. మరో 10 మందికిపైగా గాయాలయ్యాయి. ఇందులో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. వెంటనే స్పందించిన స్థానికులు 108 ద్వారా క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వడిగేపల్లి వద్ద 'పది' విద్యార్థి...

గోరంట్ల : మండలంలో పులగుర్లపల్లి గ్రామానికి చెందిన పదవ తరగతి గగన్‌రెడ్డి (15) సోమవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పుల్లగుర్లపల్లికి చెందిన గగన్‌రెడ్డి సోమవారం పదో తరగతి పరీక్ష రాసేందుకు గోరంట్లకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మండలంలోని వడిగేపల్లి సమీపంలోకి రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ మాజీ మండల కన్వీనర్ మృతి

కొత్తచెరువు : మండల కాంగ్రెస్ పార్టీ మాజీ కన్వీనర్ వలిపి పెద్దన్న (67) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డి.శ్రీధర్‌రెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి, మండల వైసిపి నాయకులు రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర్, తదితరులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, పెద్దన్న, దాల్మెల్ సూరి, నారాయణ, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు ప్రయాణికునికి అందజేత

డబ్బు పోగొట్టుకున్న ప్రయాణీకుడికి డబ్బును అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం డిపో ఆర్టీసీ బస్సులో డబ్బు పోగొట్టుకున్న ఓ ప్రయాణికుడికి తిరిగి ఆ డబ్బును అప్పగించిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. ధర్మవరం ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సోమవారం అనంతపురం నుంచి ధర్మవరానికి బయలుదేరింది. ఈ బస్సులు ధర్మవరం ఎల్‌బిసి కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న సూరిబాబు అనంతపురంలో ఎక్కాడు. బస్సు ధర్మవరం చేరుకోగానే ప్రయాణికుడు బస్సులో క్రెడిట్ కార్డుతోపాటు రూ.10,500 నగదు పోగొట్టుకున్నాడు. అయితే డబ్బు అనంతపురానికి చెందిన కానిస్టేబుళ్లు గంగాధర్, రామలింగకు దొరకడంతో ధర్మవరం డిపో ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు చేతికి అందజేశారు. ఆయన క్రెడిట్ ఆధారంగా ప్రయాణికుడి అడ్రస్ కనుక్కుని డబ్బు, క్రెడిట్ కార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రేమకుమార్, అకౌంటెంట్ ఓబుళేష్, సీనియర్ అకౌంటెంట్ దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా ఆనంద్‌కుమార్

ఆనంద్‌కుమార్

హిందూపురం : హిందూపురం కమిషనర్‌గా ఆనంద్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పురపాలక సంఘంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌కుమార్‌కు మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి అదనపు భాధ్యతలు అప్పగిస్తూ పురపాలక శాఖ ఉన్నాతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

స్పందనలో 141 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 141 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సకాలంలో స్పందన అర్జీలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టిఎస్ చేతన్, డిఆర్ఓ కొండయ్య, ఆర్‌డిఓ భాగ్యరేఖ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నోటా.. జగన్ మాట : మున్సిపల్ వైస్‌చైర్మన్

ప్రజాశక్తి-హిందూపురం

ఏ వార్డుకు వెళ్లినా.. ఏ ఇంటికి వెళ్లినా ప్రతి ఒక్కరి నోటా సిఎం జగన్ పేరే వినపడుతోందని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తెలిపారు. సోమవారం 35వ వార్డు కౌన్సిలర్ మద్దెన జయప్ప ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపైన ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మనోహర్, వార్డు వాలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికిస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి

మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-గుడిబండ

ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి పొందకుండా అక్రమంగా మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న మండల పరిధిలోని ముత్తుకూరు పంచాయతీ సర్పంచి జగదాంబ భర్త క్రిష్టప్పపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన క్రిష్టప్ప ఎస్ఐ, ఇఒఆర్‌డిలకు వేర్వేరుగా సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పొలానికి ఆనుకుని ప్రభుత్వం చెక్‌డ్యాంను నిర్మించిందన్నారు. ఈచెక్‌డ్యాంలోని మట్టిని క్రిష్టప్ప అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడని ఫిర్యాదు చేశాడు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ సెల్విసాల్మాన్

ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ధర్మవరం డివిజన్ డిప్యూటి డిఎంఅండ్ హెచ్‌ఓ సెల్విసాల్మాన్ సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలోని ఐసోలేషన్ బెడ్స్, ఆక్సిజన్ సపోర్ట్, వెంటిలేటర్ సపోట్ బెడ్స్, డాక్టర్స్, నర్స్. పారామెడికల్ తదితర వాటిని పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మలత, ఫార్మాసిస్టు భాస్కర్, అర్బన్ సూపర్‌వైజర్ అన్నా లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

వైసిపి నాయకునికి పరామర్శ

కొత్తచెరువు : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యుడు వాల్మీకి శంకర్‌ను ఎమ్మెల్యే తండ్రి వెంకటరామిరెడ్డి సోమవారం పరామర్శించారు. ప్రమాదంలో కాలు విరగడంతో వైద్య చికిత్స చేయించుకుని 15 రోజులుగా ఇంటి వద్ద ఉంటున్నాడు. విషయం తెలుసున్న వెంకటరామిరెడ్డి బాధితుడిని పరామర్శించి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర్, పెయింటర్ కేశవ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి శంకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తండ్రి వెంకటరామిరెడ్డి

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

కరాటేలో బెల్ట్‌లు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-కదిరిటౌన్

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హరీష్ స్కూల్ కరస్పాండెంట్ కిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి గంగమ్మ మోరి వద్ద ఉన్న హరీష్ స్కూల్లో కియో జపాన్ షాటోకాన్ కరాటే డు అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి 19 మందికి ఎల్లో బెల్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే చాలా అవసరమన్నారు. అంతేగాకుండా ఆరోగ్యంతోపాటు శారీరక దఢత్వం ఇమ్యూనిటీ పవర్ వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ అక్బర్ అలీ, కరాటే కోచ్ వసుంధర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణపనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పేదలకు ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసుకునే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, హౌసింగ్ డిఇ మునీశ్వరాయుడులు సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని సచివాలయ అమ్యూనిటీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాలు ఎన్ని అయ్యాయి.. గోడల వరకు ఎన్ని పూర్తి చేశారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ అమ్యూనిటీ కార్యదర్శులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

వందపడకల ఆసుపత్రిని నిర్మిస్తాం : పాల్యం సుధాకర్

ప్రజాశక్తి-నల్లచెరువు

మండల పరిధిలోని పాలపాటిదిన్నె సమీపంలో సుమారు రూ.20లక్షలతో 100 పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు కృషి చేస్తామని వ్యాపార రీత్యా బెంగుళూరులో నివాసం ఉంటున్న నల్లచెరువు వాసి పాల్యం సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తన తండ్రి కీర్తిశేషులు పాల్యం గంగన్న జ్ఞాపకార్థం జూన్ నాటికి అధునాతన సదుపాయాలతో వీలైనంత త్వరగా వృద్ధాశ్రమాన్ని పూర్తి చేస్తామన్నారు.

నారా లోకేష్‌కు షీల్డ్ అందజేత

లోకేష్‌కు షీల్డ్‌ను బహూకరిస్తున్న మాజీమంత్రి పరిటాల సునీత, నాయకులు

కనగానపల్లి : శింగనమల మండలంలో కొనసాగుతున్న నారాలోకేష్ పాదయాత్రలో మాజీమంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో టిడిపి నాయకులు పాల్గొని సోమవారం షీల్డ్‌ను బహూకరించారు. రాప్తాడు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర విజయవంతమైన సందర్భంగా లోకేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలపడంతోపాటు షీల్డ్‌ను అందజేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ మండల కన్వీనర్లు యాతం పోతలయ్య, కొండప్ప, ముత్యాలరెడ్డి, జింక సూర్యనారాయణ, సుధాకర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి నీటి కొళాయి ప్రారంభం

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండల కేంద్రంలోని సాయిరాం థియేటర్ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీసత్యసాయి నీటి కొళాయిని ఉప సర్పంచు కోటి గోపీనాథ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొళ్లాయి వద్ద నీటిని వృథా చేయకుండా సక్రమంగా పట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ లోకేష్‌నాయుడు, మంగళ కొండా, రామాంజనేయులు, మంగళ రాము తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి కుళ్లాయిని ప్రారంభిస్తున్న ఉప సర్పంచు కోటి గోపీనాథ్

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి : ఉపాధి హామీ పథకం కింద 2023-24 సంవత్సరానికి పండ్ల తోటల పెంపకానికి అర్హత, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని బత్తలపల్లి ఎపిఒ కుందానం ఆదెప్ప తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ కుటుంబానికి ఐదెకరాల భూమి ఉండి, గతంలో ఉపాధి హామీ పథకంతో లబ్ధి చేకూరి ఉండరాదన్నారు. అలాంటివారు పట్టాదారు పాసు పుస్తకం నకలు, 1బీ నకలు, ఆధార్ కార్డు నకలు, బ్యాంకు పాసు పుస్తకం నకలతోపాటు తహశీల్దార్ జారీ చేసిన చిన్న, సన్నకారు రైతు సర్టిఫికెట్, రైతు యొక్క ఫీల్డ్ ఫొటోతో ఈనెల 20వ తేదీలోపు సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒ, ఇసిని సంప్రదించాలని కోరారు.

భక్తులకు అన్నదానం

అమడగూరు : మండల పరిధిలోని చౌడేశ్వరీదేవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా జ్యోతి ఉత్సవాలకు విచ్చేసిన భక్తులకు సోమవారం అన్నదానం చేశారు. మండల పురధిలోని చీకిరేవులపల్లి, శీతిరెడ్డిపల్లి, గంగిరెడ్డిపల్లి, బలకవారిపల్లి, రెడ్డివారిపల్లి, నల్లగుట్లపల్లి గ్రామాలకు చెందిన భక్తులు భారీగా ఉత్సవాలకు తరలివచ్చారు. వారందరికీ గ్రామస్తులు, వివిధ పంచాయతీల యువత సహకారంతో అమ్మవారి ఆలయం ఎదుట అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ పంచాయతీల గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

పరీక్ష కేంద్రాల తనిఖీ

కొత్తచెరువు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల, శ్రీవిద్య పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను డిఇఒ మీనాక్షి, తహశీల్దార్ రామాంజనేయరెడ్డి సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరాతీశారు. అంతేగాకుండా పరీక్ష సరళిని పరిశీలించారు. కాగా జిల్లావ్యాప్తంగా 125 కేంద్రాల్లో 24,616 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 298 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

రొద్దం : మండలంలోని మూడు కేంద్రాల్లో సాగుతున్న పదోతరగతి పరీక్షలు సోమవారం కూడా ప్రశాంతంగా సాగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ నాగస్వామి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తలుపుల : ప్రధానమంత్రి సురక్షా మాతృత్వ అభియాన్‌లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ మున్వర్‌బాషా 76 మంది గర్భిణులను పరీక్షించి 14 మందికి రక్త హీనత ఉన్నట్లు గుర్తించి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇచ్చారు. మరో 15 మందిని ఉచిత అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం కదిరికి పంపారు. అనంతరం గర్భిణులు ప్రసవం వరరూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సూచనలు ఇచ్చారు. కాగా పుట్టపర్తిలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న తలుపుల వాసి గంగిశెట్టి గారి తరుపున ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి అన్నదానం చేశారు.

In the Court of the Senior Civil Judge:Penukonda
I.A.482/2019 I.A.483/2019 I.A.484/2019
I.A.485/2019 I.A.486/2019 I.A.487/2019
A.S.01/2018
Between:
E.Chandra Sekhar Gowd ...Appellant
And
M.Venkata Sivaiah and others ...Respondants
Notice to Respondant No.R9 to R11
To,
R9: M.Rudra Sai S/o M.Gangadhari, 46 years, Chitravathi Road, Puttaparthi (T&M), Sri Sathya Saia Dist.
R10:M.Lakshmidevi W/o M.Nagendra, 65 years, Chitravathi Road, Puttaparthi (T&M), Sri Sathya Saia Dist.
R11:Lalitha W/o Ramesh Naidu, 37 years, Garladinna (T&M), Ananthapuramu Dist.
ఇందుమూలముగా మీకు తెలియజేయడం ఏమనగా పై అప్పీలు నందు 2 మరియు 3వ ప్రతివాదులైన ఎం.నాగేంద్ర మరియు ఎం.వెంకటసుబ్బయ్యల మరణానంతరము వారుసులుగా చేర్చుటకు దాఖలు చేసిన పై కనబరచిన అర్జీలతో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించిన మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. మీ హాజరు నిమిత్తం పై అర్జీలలో 20-04-2023వ తేదిన వాయిదా వేసినారు. కావున 20-04-2023వ తేదిన పై కోర్టులో ఉదయం 10.30 గంటలకు ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో పరోక్షంగా తీర్మానించెదరు.
(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
ఎం.డి. ఆసిఫ్, అడ్వకేట్
పెనుకొండ శ్రీసత్యసాయి జిల్లా.

వడ్డెర్లకు పెద్దపీట వేస్తామని నారా లోకేష్ హామీ

టిడిపి రాష్ట్ర కార్యదర్శులు దేవళ్ల మురళి, కొల్లకుంట అంజినప్ప

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలోని వడ్డెర్లకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తామని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో హామీ ఇచ్చినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దేవళ్ల మురళి, కొల్లకుంట అంజనప్ప, టిడిపి వడ్డెర రాష్ట్ర సాధికార సభ్యుడు పరిగి హనుమయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు సత్యపాల్ కమిటీ వేసి 173 జిఒ తీసుకొచ్చి, వడ్డెర్ల అభివృద్ధి కోసం రూ.132 కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక వడ్డెర్లను పూర్తిగా విస్మరించారన్నారు. వడ్డెర్లు అభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో గొంగటిపల్లి శ్రీనివాశులు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

కారుణ్య నియామకం

పద్మకు విఆర్ఎగా నియామకం ఉత్తర్వులు అందజేస్తున్న తహశీల్దార్ యుగేశ్వరీదేవి

బత్తలపల్లి : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విఆర్ఎ సాకే ఒగప్ప భార్య పద్మకు కారుణ్య నియామక పత్రాలను తహశీల్దార్ యుగేశ్వరీదేవి సోమవారం అందజేశారు. రెండు నెలల క్రితం బత్తలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో డి.చెర్లోపల్లి విఆర్ఎ మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో తమను ఆదుకోవాలని మృతుని భార్య పద్మ విజ్ఞప్తి మేరకు తహశీల్దార్ కారుణ్య నియామకం కింద పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హరిప్రసాద్, విఆర్‌డి నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజల కేంద్రంలో మరమ్మతులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-రొద్దం

తాగునీటి శుద్ధజల కేంద్రంలోని మోటార్లకు మరమ్మతులు చేపట్టి ప్రజల దాహార్తి తీర్చాలని స్థానికులు పంచాయతీ కార్యదర్శి శాంతికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సుధాజల కేంద్రం కొన్ని రోజులుగా పని చేయకపోవడంతో పక్కనున్న గ్రామాలకు వెళ్లి డబ్బులు పెట్టి నీటిని కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కావున వెంటనే స్పందించి శుద్ధజల కేంద్రంలోని మెటార్లకు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించాలని కోరారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శి స్పందిస్తూ సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రమణ, నరేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును తగ్గించాలి

కోతలను నివారించాలి - టిడిపి ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ల వద్ద నిరసన

పుట్టపర్తిలో నిర్వహించిన నిరసనలో మాట్లాడుతున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని గణేష్ సర్కిల్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ 2014లో టిడిపి అధికారంలోకి రాకముందు 1.2 మిలియన్ యూనిట్ల లోటు ఉండగా అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక విద్యుత్ ఛార్జీలను పెంచకుండా లోటు నుంచి మిగులు విద్యుత్‌కు తెచ్చారని గుర్తు చేశారు. అయితే 2019 నుంచి జగన్ ప్రభుత్వం ఇప్పటివరకు ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అప్పులు తెచ్చి రూ.57,188 కోట్ల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జెన్‌కె, సిజిఎస్‌లో ఒక యూనిట్ విద్యుత్ సరాసరి రూ.5కే వస్తోందన్నారు. అయితే ప్రభుత్వ సంస్థల్లో విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నిలిపి వేసి కమీషన్ల కోసం ఒక యూనిట్ సరాసరి రూ.9 పెట్టి కొనుగులో చేస్తున్నారన్నారు. దీంతో రూ.12,200 కోట్ల ఖర్చు అదనంగా వస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యుత్ ఛార్జీలను తగ్గించడంతోపాటు కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సోమకోటి ఆదినారాయణ, పుల్లప్ప, మండల కన్వీనర్లు విజయ్‌కుమార్, రామాంజనేయులు, గూడూరు ఓబులేసు, శ్రీరామ్‌నాయక్, ఉపేంద్ర, ఓబులేష్, ప్రవీణ్, మురారి, అంబులెన్స్ రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా టిడిపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న కనకదాస సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం విద్యుత్ డిఇ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా టిడిపి పార్లమెంట్ కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ, పట్టణ అధ్యక్షులు రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు నాగరాజు మాట్లాడుతూ ఇప్పటికే కష్టాల్లో ఉన్న నిరుపేద, పేద, మధ్యతరగతి ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారం వేయడం మంచిది కాదన్నారు. వెంటనే విద్యుత్‌ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డి, రాష్ట్ర బీసీ తెలుగు మహిళ, మైనార్టీ సెల్, తెలుగు మహిళ ఎస్టీ కార్యదర్శులు బెవనహల్లి ఆనంద్, అమరనాథ్, పరిమళ, డైమండ్ బాబా, వెంకటరమణ, సీనియర్ నాయకులు నెట్టప్ప, రాము, రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ సతీష్, రాఘవేంద్ర, పార్లమెంట్ వాణిజ్య విభాగపు అధ్యక్షులు జేపీకే రాము, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరన్న ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు సోమవారం పట్టణంలోని విద్యుత్ ఎడి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడుతూ 2014కు ముందు మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని ఇప్పుడు లోటు విద్యుత్‌కు మార్చారన్నారు. అంతేగాకుండా ఇప్పటి వరకూ ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. కావున ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ ఎడి సుబ్రమణ్య ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి రవిభూషన్, మాజీ ఎంపిపిలు ఆదినారాయణ, అశ్వర్థామప్ప, మాజీ మండల్ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ప్రకాష్, తాలూకా రైతు అధ్యక్షులు రాజ్‌గోపాల్, క్రిష్టప్ప, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరిటౌన్ : విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక విపరీతంగా విద్యుత్ ఛార్జీలు పెంచుతోందన్నారు. కావున వెంటనే విద్యుత్ ఛార్జీలను తగించాలని డిమాండ్ చేశారు.

పరిగి : విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ టిడిపి మండల టిడిపి కన్వీనర్ లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. అనంతరం విద్యుత్ ఎఇ మొయిద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, ప్రవీణ్‌రెడ్డి, చౌడప్ప, నీరుగంటి నరసింహులు, నంజుండప్ప, డిఎస్‌ఎల్ శ్రీనివాసులు, వడ్డెర చంటి, పలువురు పాల్గొన్నారు.

రామగిరి : మాజీమంత్రి పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు మండల పరిధిలోని పేరూరు సబ్‌స్టేషన్ ముందు టిడిపి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షులు ఎల్.శ్రీధర్‌నాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి డి.పోతున్న, మండల మైనారిటీ అధ్యక్షులు దాదా, నియోజకవర్గ రైతుసంఘం కార్యదర్శి ముత్యాలు, బిసి సెల్ నియోజకవర్గ కార్యదర్శి చిత్తరంజన్, పేరూరు గ్రామ కమిటీ అధ్యక్షులు వడ్డే సుబ్బు, మంగాపురం ముత్యాలు, నాగరాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనగానపల్లి : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం కనగానపల్లి, తగరకుంట విద్యుత్ సబ్‌స్టేషన్ల ముందు టిడిపి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి నెట్టం వెంకటేష్, మండల కన్వనర్ యాతం పోతలయ్య మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ముకుందనాయుడు, సుబ్బయ్య, కాసుమూర్తి వెంకటేష్, బిల్లే భాస్కర్, సురేష్‌చౌదరి, తిరుపాల్, బోదుల రామాంజి, హరి, బిల్లే దాము, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నరసింహులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో మండలం కేంద్రంలోని 133 కేవీ, 32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు వద్ద నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జయప్ప, ఆనంద్‌కుమార్, నాగలింగారెడ్డి, చంద్ర, రమేష్, షేక్షావలి, సీనియర్ నాయకులు, అనుబంధ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలుపుల : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ముందు టిడిపి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిందన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముబారక్, రాజారెడ్డి, జైచంద్ర, రాధాకృష్ణ, కొమ్మెర శీన, బాబురెడ్డి, బాబు, గంగరాజు, సిద్ధేశ్వరి, అజంతుల్లా, రఘు, రమణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రొద్దం : పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ సోమవారం మండలంలోని క్లస్టర్-1లో ఉన్న తురకలపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి జిల్లా ఇన్‌ఛార్జి బికె పార్థసారధి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ నరహరి, మాజీ అధికార ప్రతినిధి నరసింహులు, నియోజకవర్గ కన్వీనర్ చిన్నప్పయ్య, రామకృష్ణప్ప, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బమ్మ, లీలావతి, మాజీ సర్పంచి అశ్వర్థనారాయణ, హరీష్, తురకలపట్నం నాగేంద్ర, హరికృష్ణ, షణ్ముఖ, ప్రశాంత్, మురళి, సర్పంచులు మంజు, నాగరాజు, రాము, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తాజుద్దీన్, దాస్‌రెడ్డి, ఆంజనేయులు నాయక్, చంద్ర, మాబాషా, రవి, బావ సాబ్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ టిడిపి మండల కన్వీనర్ మల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

మడకశిరలో ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శివారెడ్డి, కేశవనాయుడు, జయరాం, చంద్ర, మాణిక్యం, సురేష్, రాజారెడ్డి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సబ్‌స్టేషన్ సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున వెంటనే వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ట్రాన్స్‌కో ఎఇ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి అశ్వర్థరెడ్డి, ఫిరోజ్‌బాషా, గంగంపల్లి నరసింహులు, వేణు, జయరాం, బాలకృష్ణ చౌదరి, నరసింహులు, గంగాధరప్ప, శ్రీనివాసులు, మాజీ డీలర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల కేంద్రంలోని పూలకుంట రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి మాబూసాబ్ మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, సీనియర్ నాయకులు నాగభూషణ నాయుడు, రమేష్‌నాయుడు, కరుణాకర్ నాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతుసంఘం కార్యదర్శి రమేష్‌బాబు, మండల కన్వీనర్ కరణం ప్రభాకర్‌నాయుడు, క్లస్టర్ల ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్‌నాయుడు, వినోద్‌బాబు, కృష్ణమూర్తి, స్టూడియో అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పెంచిన విద్యుత్ ఛార్జీలను నిరసిస్తూ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో స్థానిక కదిరి గేటు నుంచి ర్యాలీ మార్కెట్ యార్డు వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వరకూ వెళ్లి ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా ధర్మవరం-బతలపల్లి రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచిందన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, ముత్యాలప్పనాయుడు, బోయ రవిచంద్ర, పురుషోత్తగౌడ్, మేకల రామాంజినేయులు, గరుగు వెంగప్ప, భీమనేని ప్రసాత్‌నాయుడు, సాహెబ్బీ, పరిశే సుధాకర్, దేవరకొండ రామకృష్ణ, నాగూర్ హుస్సేన్, రాంపురం శీన, క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్, రాళ్లపల్లి షరీఫ్, చిగిచెర్ల రాఘవరెడ్డి, అంబటి సనత్, చీమల రామాంజి, చీమల నాగరాజు, బొట్టు కిష్ట, అత్తార్ రహీంబాషా, గంగారపు రవి, వరదరాజులు, మారుతీస్వామి, తొగట అనిల్, బిల్లేశీన, మాబు, బత్తల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

ముదిగుబ్బలో ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

కదిరిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు